**కొలకలూరి ఇనాక్ సాహిత్యం - చారిత్రక అధ్యయనం**

జాతీయ కవి ఆచార్య కొలకలూరి ఇనాక్‌గారు బహు గ్రంథ కర్త. ఆయన చేపట్టని ప్రక్రియ అంటూ లేదు. కథ, నవల, నాటకం, నాటిక, కవిత్వం, విమర్శ... మొదలైన ప్రక్రియలన్నీ ఆయన కలం నుంచి జాలువారినవే.

సాహిత్యాన్ని చరిత్రగా , చరిత్రను సాహిత్యంగా అధ్యయనం చేయవలసి వచ్చినట్లయితే కొలకలూరి ఇనాక్ రచనలు అందుకు ఉదాహరణలుగా నిలుస్తాయి. ఈ నేపథ్యంలో ఒక రచనను ఏ దృష్టితో చూడాలని వివేచించినపుడు అందులో భాగంగా కొలకలూరి ఇనాక్ గారి కులవృత్తిని ఎన్నుకున్నాను. కథను మనం ఏ విధంగా చదవాలి? ఎలా అధ్యయనం చేయాలి అనేది ప్రశ్న. కొన్ని కథలు కాలక్షేపం కోసం చదువుతుంటాం. కొన్ని కథలు అందరికీ తెలిసినవే అయినా పరిశోధనా దృష్టితో చూస్తేనే కానీ వాటి విలువ తెలియదు. ఉదాహరణకు పంచతంత్ర కథ, మొసలి కోతి కథ అందరికీ తెలిసిందే. తెలియని వారుండరు. తెలివితేటలతో కోతి ప్రాణాపాయం నుంచి బయటపడింది. కానీ ఇందులో గిరిజన సంస్కృతి దాగుందనే విషయాన్ని అర్థం చేసుకోవలసి ఉంది. మొసలి భార్యకు అనారోగ్యం అని చెప్పి కోతి గుండె కావాలని అడుగుతుంది. కోతి మాంసం ఆస్తుకు మంచిదని జానపదుల (వైద్యుల) విశ్వాసం. ఈ కోణంలోనే ఇనాక్ గారి కట్టడి కనిపిస్తుంది. ఒక చారిత్రక సత్యాన్ని అందిస్తుంది. ఆలోచింపచేస్తుంది. అంతరించి పోతున్న ఒక వ్యవస్థనూ అందులో మిగిలి ఉన్న మాదిగల అశ్రిత కులమైన బండోళ్ళని పరిచయం చేస్తుంది. మొండోడు మాదిగల దగ్గర అడుక్కునే పది ఉపకులాల చివరి కులం వాడు . ఏక భుక్తం తీరకపోతే బావిని కట్టడి చేస్తాడు. వందేళ్ల కథా సాహిత్యంలో ఒకే వస్తువును స్వీకరించి కాలానుగుణంగా కథారచనలో, భావజాలంలో, సామాజిక చిత్రణలో వచ్చిన క్రమ పరిణామాన్ని నిర్ధారించవచ్చు. ఒకే కథా వస్తువును భిన్న వ్యక్తులు దర్శించిన కోణం చారిత్రిక అధ్యయనానికి ఉపకరిస్తుంది. 1930 నుంచి 2006 వరకు వచ్చిన కథలను ఎంపిక చేసుకొని అందులోనూ ఒకే వస్తువుకు సంబంధించిన కథలను స్వీకరించవచ్చు. ఉదా: చెప్పులు అనే వస్తువును గురించి కొంతమంది రచయితల కథలను రూపొందించారు. అవి గమనిస్తే...

లీలా సరోజిని-మాదిగవాడు(1930), చరా-కొత్త జోడు (1938), కవుటూరు వెంకట నారాయణ రావు-చెప్పులు, కరుణకుమార(కందుకూరి అనంతం)-కొత్త చెప్పులు (1950-1956), గోపీచంద్-చెప్పులు కుట్టేవాడు (1961),జింబో (మంగారి రాజేందర్)- చెప్పులు, రామచంద్ర-కిర్రుచెప్పులు(2001), బోయ జంగయ్య -ఇదికతా(1996), కొలకలూరి ఇనాక్-కులవృత్తి (2006)... వందేళ్ల చరిత్రకు ఇది పునాది. ఒకే కథా వస్తువు ను భిన్న వ్యక్తులు దర్శించిన కోణం చారిత్రక అధ్యయనానికి అవకాశాన్ని కల్పిస్తుంది. చెప్పులు కుట్టే మాదిగ వాడు రాజు కన్నా ఆనందంగా ఉన్నాడని 'మాదిగవాడు' కథ, స్నేహానికి, సంవేదనకి, సానుభూతికి సంకేతంగా చరా'కొత్తజోడు', కృతజ్ఞతకు సంకేతంగా 'చెప్పులు', సామూహిక ప్రతిఘటనకు సంకేతంగా 'కొత్తచెప్పులు', మార్పులేని జీవితాలు, అస్తిత్వం లేని బతుకులు, సర్దుకు పోయే మనస్తత్వాలు ఈ కథల్లో కనిపిస్తాయి. వృత్తులు మారాయి కానీ ప్రవృత్తి మారలేదని,వృత్తులు పోయాయి ఆత్మగౌరవం దక్కిందని, కుల వృత్తుల వారికి సమాన హోదా కావాలని రచయితల ఆలోచనలు, సామాజిక దృక్పథం వీటిల్లో కనిపిస్తాయి. ఆయా కాలాలలోని సామాజిక స్పృహ ఏ విధంగా ఉందో అర్థమవుతుంది.

## కొలకలూరి ఇనాక్ అనంత జీవనం నవల - భిన్న పార్శ్వాలు

ఇనాక్ రచించిన తొలి నవల సమత (1962). తరువాతి కాలంలో అనాథ, సౌందర్యవతి, సౌభాగ్యవతి, ఇరులలో విరులు, ఎక్కడుంది ప్రశాంతి? రెండు కళ్లూమూడు కాళ్లు, అనంత జీవనం నవలలు రాశారు. కథానాయకుడు, నాయిక కలుసుకున్నప్పుడల్లా వచ్చేది సినిమా వర్షం. 'భారీ వర్షంతో జనజీవనం అస్తవ్యస్థం' అని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయని, అనేక చోట్ల నాలాలు పొంగి పొర్లాయని, రహదారుల ప్రధాన కూడళ్ళ వద్దనీరు నిలవడంతో ట్రాఫిక్‌జామ్ ఏర్పడి బస్సు, రైలు వాహనాలు బారులు తీరాయని, ట్రాఫిక్ నియంత్రించేందుకు పోలీసులు నానా తిప్పలు పడ్డారని, ఇళ్ళలో నీరు చేరిందని, ప్రజలు ఇబ్బంది పడ్డారని, అధికారులు స్పందించలేదని చెప్పేది పత్రికా వర్షం. వాతావరణ వివరాలు 5 సెం.మీ వర్షం నమోదయ్యిందని కనిష్ట, గరిష్ట వర్షపాతం, గాలిలో తేమను గురించి చెప్పేది రేడియో , టీ.వీ. వార్తా వర్షాలు. ఇవి మనందరికీ తెలిసిన వివరాలు.

తెలియని కోణాన్ని అందిస్తుంది అనంతజీవనం నవల. అనంతజీవనం నవలకు ముందు మాటగా రచయితే నవలా వస్తువును తడి మాటలతో అందించారు. పొడి మాటలనడం లేదు. తడిమాట అంటున్నాను. వర్షంలో తడిసే అవస్థలు భిన్న జీవన పార్శ్వాలు కనిపిస్తాయి. సాహిత్యాన్ని చరిత్రగా అధ్యయనం చేసే కోణంలో ఈ నవల మనకందించే అంశాలను గురించి పరిశీలించాలి. నవలారంభంలో చారిత్రకాంశాలనేకం ఉన్నాయి.

నేలగల్లు ప్రభువులు విజయనగర ప్రభువుల వారసులుగా ఉండేవారు. హండే వంశం వాళ్ళు కొంత భూమిని, విజయ నగరం రాజులు కొంత భూమిని, నైజాం నవాబు కొంత భూమిని పట్టుకు పోగా నేలగల్లు రాజులు జమిందారులుగా, భూ కామందులుగా, మోతుబరి రైతులుగా మారిపోయారు.

బళ్ళారిని రెండుగా చీల్చి అనంతపురం జిల్లాను ఏర్పరచినపుడు నేలగల్లు పాలగాళ్ల వంశంలో మిగిలింది గంగారెడ్డి. అనంతపురం ఏర్పడ్డ విధానం, నేలగల్లు రాజులు, పాలకులు, జమిందారులు, భూకామందులు, మోతుబరి రైతులు ఏర్పడ్డ విధానాన్ని ఈ నవల వివరిస్తుంది. చెరువులు, రోడ్లు, ఇళ్ళ నిర్మాణం మొదలైన అంశాలను వివరించే సందర్భంలో అనంతపురం భౌగోళిక స్వరూపాన్ని వివరించారు. ఈ స్వరూపం ఏర్పడ్డ విధానంలో క్రమ పరిణామాన్ని గుర్తించారు. హరిహర బుక్కరాయల జ్ఞాపకార్థం చిక్కప్ప వడయారు అనంతపురానికి చెరువు తవ్వించి అనంతమ్మ పేరిట అనంత సాగరం అని పేరు పెట్టారు. ఆరువందల ఏళ్ళ క్రితం గట్లు పోసి కట్టలు కట్టి వాన నీటిని నిలుపగా పెద్ద చెరువు అయ్యింది. అదే అనంత సాగరం. అనంతమ్మ సాగరం. అమ్మ అనడం ఇష్టంలేకనో ఏమో అనంతసాగరం అయ్యింది. చరిత్రను అధ్యయనం చేసినా, శాసనాలను గమనించినా మనకిటువంటి అంశాలు తెలుస్తాయి. రచయిత బుక్కరాయ సముద్రం , ముసలమ్మకట్ట, పండమేరు... నవలలో అనంతపురం స్వరూపాన్నంతటినీ మనముందుంచుతారు రచయిత.అనంతపురం ప్రాంతానికి సంబంధించి రచయిత అవగాహనను, పరిశోధనా దృష్టిని తెలియచేస్తుంది. అనంతపురంలో గాలికాలం ఒకటుంటుంది. గాలి రావటానికంటే గాలి రాకుండా చూసుకోవడానికే ఇళ్ళు కట్టేటప్పుడు ఏర్పాట్లు చేసుకుంటారు. కిటికీలకన్నా తలుపులు

ఎక్కువ. కొట్టాలు, మిద్దెలు, తీరుబండ ఇండ్లు, పిల్లర్‌లేపి సిమెంట్ ఇళ్లు ఈవిధంగా ఇళ్ళ నిర్మాణాలలోనూ తేడాలను, అవి ఏర్పడ్డ క్రమాలను చూపించారు.

9-11-1996 నాడు కుంభవృష్టి కురిసింది. అనంతపురంలో వర్షాలు లేక పోవటం తెలిసిందే. రాయలసీమలో కరువు విలయ తాండవం చేస్తుందని, పరిస్థితి భయంకరంగా ఉంటుందనీ హెచ్చరిక చేస్తూనే ఉన్నారు. అటువంటి అనంతపురంలో పదేళ్ళుగా రాని వర్షం ఒక్కసారిగా కుంభ వృష్టిగా కురిసింది. పాతికేళ్ళుగా మురికి కాలువలు కాలువల్లా లేవు. ఫర్లాంగు వెడల్పు కాలువ ఇప్పుడు ఇరకు కాలువ అయ్యింది, వర్షం వలన ఏర్పడ్డ భాధలు బాధితుల వ్యధలు, సామాన్య ప్రజల కష్టాలు , పారిశుధ్యం చేసేవారి బాధలను ఎవరూ పట్టించుకోరు. ఏ పేపరు, ఏ సినిమా చూపించదు. కానీ కొలకలూరి ఇనాక్ గారు అనంత జీవనం నవలలో మాదిగల జీవన పార్శ్వాలను చిత్రించిన విధానాన్ని గమనించండి.

1. సుబ్బరాయుడు దగ్గర జీతగాడు అంకాలప్ప. బుడిగెజంగం అంకాలప్ప గొర్రెలను పోగొట్టు కొని ఎవరైనా మంచి బుద్ధితో అప్పగిస్తారని చూస్తాడు. - ఎంతకీ రాని సుబ్బరాయడు మరుసటి రోజు వస్తే బావురుమన్నాడు. పోనీలేరా అని సుబ్బారాయుడు అంకాలప్పను దగ్గరకు చేర్చుకున్నాడు. అంకాలప్పలో మంచి బుద్ధి, లోకం తీరు తెలియని అమాయకత్వం కనిపిస్తుంది.

2. యెద్దీరప్ప మేస్త్రీ. మాదిగోడు.తాను కట్టిన ఇళ్ళ పరిస్థితిని ఆ వర్షంలోనే తిరిగి గమనిస్తాడు. అతని ఐదవ భార్య నాగలచ్చుమమ్మ ఇల్లు కూలింది.

3. ఒక అవ్వ గతించింది. డ్రైవర్ కాలనీలో నిండు గర్భిణీ, ఇద్దరు పిల్లలు కనిపించలేదు.- మరణించారు.

4. కాలకృత్యాలకు వెళ్ళిన పిల్లవాడు కనిపించలేదు.

5. మాదిగ నాగన్న కట్టెల అడితిలో కర్రలు తేలిపోయాయి. పెద్ద దుంగలు వాన తరువాత కంచెలో కనిపించాయి.

6.స్వీపరు యువకుడు, పాకీ మనిషి, కొట్టుకు పోయిన నలుగురు పారిశుధ్య పనుల కోసం దిగిన వారూ కనిపించారు.

7. ప్రభుత్వ బాలికల వసతి గృహంలో నాలుగు వందల మంది విద్యార్థులు ఎక్కడెక్కడున్నారో ఏయే దశల్లో ఉన్నారో తెలియదు.

8. సత్యసాయి డీమ్డ్ యూనివర్శిటీ వెనుకగోడ పడిపోయింది.

9. ఫాదర్ ఫెర్రర్ సాగునీటి సమస్య, సత్యసాయి కుళాయిలు వేయించి తాగునీటి సమస్య తీర్చే ప్రయత్నం చేశారు. నీలం సంజీవరెడ్డి భద్రాచలం కెనాల్ వేయించారు. ప్రభుత్వం నీటిని ఎలా నిలువ చేయాలో ఆలోచించలేదంటారు రచయిత.

10. సత్యసాయి , ఫాదర్ ఫెర్రర్ నీటి సమస్యను తీర్చే ప్రయత్నంలో వంకలో ఎందుకు భవనాలను కట్టారు.

11. సమాధులు మునిగాయి

12. గోవిందరెడ్డి నేల మాళిగ కూలిపోయి అస్థిపంజరాలు తేలాయి.

13. నారాయణ సిమెంటు ఖాళీ సంచులు తడిసాయి.

నేలగల్లు పాలెగాళ్ళ గంగారెడ్డికి ముగ్గురు కొడుకులు. మొదటి కోడుకు గోవిందరెడ్డి శత్రువును నామరూపాలు లేకుండా చేయగల సమర్థుడు. ఇతనిమీద వచ్చిన హత్య కేసులు తెరమరుగయ్యాయి. తనకున్న దానిలో కొంత తన పనివాళ్ళకు పంచాడు.బజారన్న చేతిలో, ఏఎస్పీ చేతిలో దెబ్బలు తిన్నాడు. చివరకు అస్థి పంజరమయ్యాడు. రెండవ కొడుకు వెంకటేశ్వరరెడ్డికి చదువు లేదు కానీ కాంగ్రెస్ ఎంపీగా ఐదు సార్లు ఎన్నికయ్యాడు. విలాసవంతుడు. ఇందిరాగాంధీ ఎమర్జెన్సీతో అతని రాజకీయ జీవితం పరిసమాప్తమైంది. అప్పటి రాష్ట్రపతి రాజగోపాలాచారి ప్రమాణ స్వీకారాణికి పిలిచినా వెళ్ళలేదు. చివరకు విలాసవంతమైన జీవితాన్ని గడుపుతూనే మరణించాడు.ఒక రాజకీయ నాయకుడి జీవితాన్ని దృష్టిలో పెట్టుకొని రచయిత ఈ పాత్రను మలిచారు. మూడో కొడుకు రామపరంధామరెడ్డి. క్రిమినల్ లాయర్. భార్య ఎలిజబెత్ లండన్ నుండి వచ్చింది. రాం.పి. రెడ్డి 95 ఏళ్ళ వయసులో నేలకొరిగాడు. వెంకటేశ్వరరెడ్డి మరణం, గోవిందరెడ్డి అరెస్టు, రాం.పి.రెడ్డి శిథిలాలలో మరణం నవలలో ఒక సందేశాన్ని అందిస్తుంది. ఈ ముగ్గురు అన్నదమ్ముల మధ్య సఖ్యత లేకపోవటాన్ని , పేద వారిలో కనిపించే సఖ్యతను సూచిస్తూ రచయిత ఈ విధంగా అంటారు. కట్ట బలహీనంగా ఉంటే అటూ ఇటూ ఉన్న చెట్ల కొమ్మలు, రెమ్మలు సాధ్యమైనంత మేర విరచి, ఆపైన రాళ్ళువేసి కట్టతెగకుండా చూస్తారు జనం. కష్టాల్లో సోదరులుగా కలిసి పోయేవారు సుఖాలలో విడిపోకపోతే ఎంత బాగుంటుంది. నిరంతర ప్రేమ, స్నేహం, ఐకమత్యం ఆత్మీయతలు వర్ధిల్లితే సమాజం ఆదర్శవంతంగా ఉంటుంది.

**అనంత జీవనం నవల రచనలో కొత్త కోణాలు**

- నిరీక్షణమే జీవితం, తెలియని తనమే జీవితం అని అంటారు ఇనాక్. జీవితం ఒక కదలిక అంటాడు చలం. జేమ్స్ జాయిస్ 24 గంటల సమయంలో జరిగిన ఒక కథను **యులిసిస్** అనే నవలగా మలిచాడు. కళ్ళు కనిపించక పోయినా జాయిస్ నవల రాసే సమయంలో గీతలు, చుక్క పెట్టి వాక్యాలు రాశాడు. ఆయన చేసిన పని తరువాత రచనలు చేపట్టిన మనోవిశ్లేషణాత్మక రచయితలకు ఒక ప్రయోగంగా నిలిచింది.
- ఈ నవలలో 9-11-1996 న కురిసిన కుంభవృష్టి 24 గంటలే కావచ్చు.రచయిత కుంభవృష్టి వచ్చిన సమయంలో ఉన్న వాడు, లేనివాడు పోందిన అనుభూతులను, అవస్థలను చిత్రికరించారు.
- ప్రాణం పోసే నీరు ప్రాణం తీయనూ వచ్చు. వరద భూస్వామ్య విధానాన్ని నేలమట్టం చేసింది. ప్లాస్టిక్ గుట్టలు పేర్చి మనిషి ప్రకృతి విపత్తుకు కారణమయ్యాడు . ప్రకృతి విపత్తుకు తారతమ్యాలుండవు. సంప్రదాయ వాది, విలాసవంతుడు, పాశ్చాత్య పద్ధతులకు అలవాటు పడ్డ జమిందారీ వ్యవస్థ నేలకూలి అస్థిపంజరమయ్యింది. మనిషిని సాటి మనిషిగా చూడలేని అసమర్థత, ఇతరులపై ఆధారపడి బ్రతకటం, ప్రకృతి వైపరీత్యాలకు ఎదురొడ్డి పారిశుద్ధ్యాన్ని చేసే సామాన్య మానవులు కష్టాల్లో కలిసిపోతున్నారు. సంతోషంలోనూ విడిపోకుండా కలిసి ఉండమంటున్నారు.
- ఒక పాత్రను చెప్పి అక్కడికి విడిచిపెట్టి, ఆ పాత్ర పర్యవసానాన్ని ముగింపులో చెప్పటం వల్ల ఇందులో నవ్యత కనిపిస్తుంది.
- ఆరంభంలోనే నవలా వస్తువును కవిత్వరూపంలో పరిచయం చేయడం విశేషం.

- ఫ్లాష్ బ్యాక్ పద్ధతిలో కథ నడుపుతూ పాత్రలకన్నా రచయితే ప్రధానంగా కనిపిస్తారు. వర్తమానాన్ని గతాన్ని మేళవించి చూపిస్తారు.
- కథా వస్తువు వర్షం వల్ల కలిగే అవస్థలు, ప్రమాదాలు
- చారిత్రక, రాజకీయ, సామాజిక నేపథ్యం బలంగా చూపబడిన నవల. కథ కన్నా వీటికే ప్రాధాన్యం ఎక్కువ. పరిశోధనా దృక్పథం గల నవల.

## వాక్య నిర్మాణం

సరళ వాక్యాలుగా కనిపిస్తాయి. కానీ సంయుక్త వాక్య నిర్మాణ పద్ధతిలో పదబంధాలు కూర్చే ప్రత్యేక వాక్య నిర్మాణంలా కనిపిస్తుంది. వాక్య శకలాలుగా నిలుస్తాయి. ఉదాహరణకు 'ఇలా దిగలేదు. ఇటువంటి పరిస్థితిలో దిగలేదు. ఈ వయస్సులో దిగలేదు' (పుట12, అనంతజీవనం). 'నీరు నిలుస్తూ ఉంది. పొంగుతూ ఉంది. పొర్లుతూ ఉంది' (పుట 18). వీటిని ఈక్వీ నౌన్ ఫ్రేజ్ సనామబంధ రూపాలనవచ్చు. వివరాణత్మకంగా వాక్యాలలో చెప్పటం, క్రియా పదాలకే ప్రాధాన్యం కనిపిస్తుంది. జరిగిన వరుస క్రమాన్ని వివరంగా చెప్పడం, ఒక స్థితికి సంబంధించిన విషయాన్ని గాఢత కోసం, ధృఢంగా స్థిరపరచడం కోసం ఇటువంటి వాక్య నిర్మాణాన్ని ఇనాక్‌గారు ఎన్నుకున్నారు.

## పదాలు

ఒక స్థితికి సంబంధించిన వర్ణనలో మూడు పదబంధాలను ఎన్నుకోవడం కనిపిస్తుంది. 'మీసం మీద నిమ్మకాయ, దబ్బకాయ, దానిమ్మకాయ నిలబెట్టిన పోటు మొగోడు మొనగాడు' (పుట 2) వాక్యంలో మూడు పదబంధాలు చోటు చేసుకున్నాయి. మీసాల ధార్డ్యతను సూచించడానికి ఈ ప్రయోగాన్ని ఎన్నుకున్నారు. ఉత్త బిత్తల వాళ్ళు, ఉత్త నెత్తుల వాళ్లు, గొడుగు నెత్తుల వాళ్ళు మొరవ చుట్టూ చేరి వీలయిన చోట నుంచి ప్రవాహం చూస్తున్నారు. (పుట 13). వివిధ రూపాలను వివరించే సందర్భంలోనూ మూడు పదబంధాల ప్రయోగం కనిపిస్తుంది. మరో ఉదాహరణ. 'భూత్ బంగళా, బూత్ బంగళా, బూతు బంగ్లా' (పుట 3). ఇటువంటి ప్రయోగాలనేకం ఈ నవలలో కనిపిస్తాయి.

## క్రియలు

రాసే పద్దతులలో ఒక్కొక్క రచయిత ఒక్కొక్క పద్ధతిని ఆశ్రయిస్తాడు. ఉదాహరణకు మోశాడు. మోయు, మోత, మోసి వంటి రూపాలలో క్రియా పదం మోసాడు అనే రూపం కూడా ఉండగా రచయిత మోశాడు అనే మాండలిక ప్రయోగాన్ని ఉయోగించడం కనిపిస్తుంది. (పుట 1)

## బహువచన రూపం:

పోయే వాళ్ళు, సంపన్నులన వాళ్ళు, ఉండేవాళ్ళు వంటి రూపాలు కనిపిస్తాయి. (పుట 1,2)

## నూతన పద ప్రయోగాలు

వెలుతురు గంతలు (గవాసులు) నీటి గంతలు (నీటి గొట్టాలు)- పుట 10

## ధ్వన్యనుకరణ పదాలు

చిర్రున నెడితే కర్రున తలుపు బిగుసుకొని రాకపోవటం(పుట 12)

బస్సు తుస్సు బుస్సు ఉండాల్సిన రీతిలో లేకపోవటం (పుట17)

వ్యతిరేకతను సూచించే సందర్భంలో, అసౌకర్యాన్ని సూచించే సందర్భంలో ధ్వన్యనుకరణ పదాలను ప్రయోగించడం కనిపిస్తుంది.

## ధ్వని పరిణామం

మొగోడు – అనంతపురం మాండలిక పదాలను గమనించవచ్చు (పుట 2) మగాడు, మగోడు, మొగాడు, మొగోడు రూపాలున్నాయి.

పగళ్ళు, పగుళ్ళు / నెర్రె, నెర్రెలు/ ఉండాయి, ఉన్నాయి (పుట 18)/ తెరుసుకుంది, కరుసుకుంది/ తెరుచుకుంది, కరుచుకుంది (పుట 12), ఎగుర్లాడు(పుట 51) చతుర్లాడు (పుట 38) మునగర (పుట32)

## అన్యపదాలు

బట్వాడా, అజమాయిషి, (పుట 29), ఇలాఖా (పుట 3), బ్లూ – బులుగు (పుట 34)

### మాండలిక పదాలు

అడితి, దుడ్డు, బులుగు, మునగర

## వర్ణన

నీటి ప్రవాహం ఒకటి తేలులాగా కొండి ఎత్తి ప్రవహించి పాములాగా మారి పడగెత్తి మంచంకిందికి వచ్చింది. రాంపి రెడ్డిని కాటేసింది. అచేతనాన్ని చేతనంగా చేతనాన్ని అచేతనంగా వర్ణించటం కనిపిస్తుంది. తాళం కప్ప ప్రాణమున్న దాన్ని నేనేమైనా ఊర్మిళనా అంటుంది.

## సామెతలు

ఇంగువ కట్టిన గుడ్డ (పుట 6)

గట్టెప్పనయితే యముడు గుర్తిస్తాడు కానీ ఉత్తప్పను పట్టించుకోడు (పుట 21)

రోగి కోరింది, డాక్టరు ఇచ్చిందీ ఒకే మందు (పుట 35)

తడిక తోసిందెవడురా అంటే ఆలిలేని వాడన్నట్లు (పుట 36)

గోరుచుట్టు మీద రోకలి పోటు (పుట 42)

పుండుకు పుల్లమొగుడన్నట్లు (పుట 38)

## ప్రచారంలో ఉన్న కథ

మబ్బు తల్లికి చాలామంది పిల్లలున్నారంట. ఆమెకు బుద్ధి పుట్టినప్పుడల్లా కురుద్దాం రండిరా అంటే బయలుదేరే వారట. పిల్లలందరూ ఒక్కలా ఉండరు. కుంటి, గుడ్డి, చచ్చు సన్యాసులు, పరుగులు తీసేవారు. కుంటి, గుడ్డి చచ్చు ఏడుస్తున్నట్లు కురవసాగాయి. అనంతపురంలో వర్షాలు లేకపోవటం అక్కడక్కడా చినుకు పడితే ఆ మబ్బుల్ని కుంటి గుడ్డి చచ్చు మబ్బులుగా చెప్పుకున్నారు.

- ఉత్తప్ప – గట్టెప్ప కాదు ఉత్తప్ప ను యముడు పట్టించుకోడు
- సాలమ్మ – సంతానం చాలని దేవుడికి దణ్ణం పెట్టుకున్నారు

## పర్యావరణం:

- చెట్టు కనబడితే కొట్టి పొయిలో పెట్టటం వల్లనో, ఇళ్ళు కట్టించుకోవటం వల్లనో వ్యవసాయం పనిముట్లు చేయించుకోవటం వల్లనో క్రమ క్రమంగా చెట్లు కనుమరుగవుతూ వచ్చాయి.
- ఫర్లాంగు వెడల్పు కాలువలు ఇప్పుడు ఇరుకు కాలువలయ్యాయి. సినిమా హాళ్ళు, పేదల పెద్దల ఇళ్ళు వచ్చి కాలువ ఇరుకయ్యింది. చెరువు నిండితే, నీరు ఎండితే ఇళ్ళు వస్తాయి.
- ప్లాస్టిక్ గుట్టలు - పర్వతాలు వ్యర్థపదార్థాలు మేటుగా తయారవటం, మురుగు కాలువ వర్షం పడితే మంచి కాలువ, ముసురు పడితే చిత్తడి కంగాళీ .

పేద, ధనిక, కులపరమైన ద్వైపాక్షిక రూపం కనిపించినా వర్షానికి అందరూ సమానమే. కష్టాన్ని నలుగురు పంచుకున్నప్పుడు సుఖాన్ని ఎందుకు పంచుకోకూడదంటారు రచయిత. సమాజాన్ని ముందుకు నడిపించి మార్గదర్శకత్వం వహించటానికి రచయితకు విశ్వ సమగ్ర దృక్పథం అవసరం. అది 'అనంతజీవనం' నవలలో కనిపిస్తుంది.

**ఆచార్య జి. అరుణకుమారి**
**హైదరాబాద్ విశ్వవిద్యాలయం.**